ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పార్ట్ ఎడిషన్
Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 130 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 15 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# జమిలి ఎన్నికల బిల్లులపై పునరాలోచనలో కేంద్రం..!

జమిలి ఎన్నికల బిల్లుల పై కేంద్రం పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది.



దిల్లీ, డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): జమిలి ఎన్నికల బిల్లుల పై కేంద్రం పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది. తాజాగా లోక్సభ బిజినెస్ జాబితా నుంచి రెండు బిల్లులను తొలగించారు. తొలుత ఈ నెల 16న లోక్సభ ముందుకు బిల్లులు తీసుకురావడానికి కేంద్రం సిద్ధమైంది. ఆమేరకు లోక్సభ బిజినెస్ జాబితాలో కూడా పొందుపరిచారు. కేంద్ర మంత్రి అర్జున్రామ్ మేఘ్వాల్ బిల్లు పెడతారని కేంద్రం పేర్కొంది. కానీ.. తాజాగా రివైజ్డ్ చేసిన లోక్సభ బిజినెస్ లో జమిలి ఎన్నికల బిల్లులు లేవు. ఈ నెల 20తో పార్లమెంటు సమావేశాలు ముగియనున్నాయి. తాజా పరిణామాలు నేపథ్యంలో.. శుక్రవారంతో ముగిసే శీతాకాల సమావేశాల్లో బిల్లులు పెట్టడంపై సందిగ్ధత నెలకొంది.లోక్సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికల అమలు కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణాన్ని చేర్చాల్సి ఉంటుంది. పార్లమెంటు పదవీ కాలంలో మార్పు కోసం.. అధికరణం 83ని, అసెంబ్లీల పదవీ కాలం సవ-రణకు.. అధికరణం 172ని, ఎన్నికల నిబంధనల రూపకల్పన కోసం పార్లమెంటుకు అధికారం కల్పించే.. అధికరణం 327ని సవరించాల్సి ఉ ంటుంది.లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్ర మంత్రిమండలి.. లోక్సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులకు ఈ నెల 12న ఆమోదం తెలిపింది.

# 2019లో నెత్తిన చెయ్యిపెట్టి

## .. ఆస్తులే రాయించుకునే పరిస్థితి: సీఎం చంద్రబాబు

పొట్టి శ్రీరాములు అమరజీవిగా ఖ్యాతి పొందారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.



విజయవాడ, డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): పొట్టి శ్రీరాములు అమరజీవిగా ఖ్యాతి పొందారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంకల్ప సిద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆత్మార్పణం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి దోహదం చేసిందన్నారు. ఆయన ప్రాణ త్యాగం తర్వాత తెలుగు రాష్ట్రం ఏర్పడిందన్నారు.“పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని రాష్ట్రం మొత్తం నింపాలని పవన్ చెప్పారు. నెల్లూరు జిల్లాను పొట్టి శ్రీరాములు జిల్లాగా పేరు మార్చాను. త్వరలో పొట్టి శ్రీరాములు పేరుతో ఏపీలో తెలుగు వర్సిటీ ఏర్పాటు చేస్తాం. గత ఐదేళ్లు ఇంత స్వేచ్ఛ ఉండేదా? పొట్టి శ్రీరాములు సొంతూర్లో అభివృద్ధి కార్యక్రమాలు తలపెట్టాం. మేం ప్రారంభించిన అభివృద్ధిని గత ప్రభుత్వం పక్కన పెట్టింది. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమనం వైపు నడిపించింది. అమరావతిని, పోలవరాన్ని గత ప్రభుత్వం నాశనం చేసింది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం. 2019లో నెత్తిన చెయ్యి పెట్టి.. ఆస్తులే రాయించుకునే పరిస్థితి తెచ్చారు. గత ప్రభుత్వంలో అనుభవించిన నరకాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలి. కేంద్రంలో మన పరపతి పెరగడం వల్ల.. రాష్ట్రానికి మంచి జరుగుతోంది” అని చంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రారంభమైన గ్రూప్ 2 పరీక్షలు

తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 783 గ్రూప్-2 సర్వీసుల పోస్టుల భర్తీకి ఈనెల 15, 16 తేదీల్లో పరీక్షలు నిర్వహించేందుకు టీజీపీఎస్సీ పటిష్ట ఏర్పాట్లు చేసింది.

హైదరాబాద్, డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో గ్రూప్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 783 గ్రూప్-2 సర్వీసుల పోస్టుల భర్తీకి ఆది, సోమవారాల్లో పరీక్షలు నిర్వహించేందుకు టీజీపీఎస్సీ పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,368 కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబరు 29న ప్రకటన జారీ చేయగా 5,51,943 మంది దరఖాస్తు చేసుకున్నారు.ఒక్కో పేపర్కు 150 మార్కుల చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు పరీక్ష జరుగుతోంది. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం పరిశీలించారు. చాలా ఏళ్ల తరువాత గ్రూప్ 2 పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రశాంతంగా పరీక్షకు హాజరు కావాలని.. ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఫలితాలు త్వరలోనే ఇస్తామన్నారు.

# సినిమాల నుంచి మంచి కన్నా చెడే ఎక్కువగా తీసుకుంటున్నారు: హోంమంత్రి అనిత

సమాజంలో మొదటి పోలీసింగ్ అమ్మే చేయాలని హోంమంత్రి అనిత అన్నారు. ఆడపిల్లలను రక్షించాలనే 'సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు చేపడుతున్నారని చెప్పారు.



పాలకొల్లు , డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): సమాజంలో మొదటి పోలీసింగ్ అమ్మే చేయాలని హోంమంత్రి అనిత అన్నారు. ఆడపిల్లలను రక్షించాలనే ఉ ద్దేశంతో 'సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు చేపడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు తర్వాత అంతే కార్యదక్షతతో పనిచేసే వ్యక్తి నిమ్మల రామానాయుడు అని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 'సేవ్ ది గర్ల్ చైల్డ్' పేరుతో 2కె రన్ నిర్వహించారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఎంతో మంది మాదక ద్రవ్యాల బారిన పడుతున్నారని వివరించారు. సినిమాల నుంచి మంచి కన్నా చెడే ఎక్కువగా తీసుకుంటున్నారని చెప్పారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించినప్పుడే నిజమైన హీరోలవుతారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆడబిడ్డలను రక్షిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు.ఆడపిల్లలకు అవకాశాలు ఇస్తే బాగా రాణిస్తారు: మంత్రి నిమ్మలఆడపిల్లలను కాపాడాలనే నినాదంతో 'సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యత కింద దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు ఇచ్చిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని వివరించారు. స్త్రీలు ఎవరిపై ఆధారపడకూడదనే చంద్రబాబు డ్వాక్రా సంఘాలు తెచ్చారని చెప్పారు. వారి రక్షణ కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతి ఇంట్లో ఆడపిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆడపిల్లలకు అవకాశాలు ఇస్తే బాగా రాణిస్తారన్నారు.

# కేసీఆర్ అరాచకాన్ని ప్రజలు ఎప్పటికీ మరవరు

## ..బహిరంగ లేఖలో మహేశ్ కుమార్ గౌడ్

భారాస అధినేత కేసీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు.





హైదరాబాద్, డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): భారాస అధినేత కేసీఆర్ కు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఏడాదిలో 54 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు అందులో పేర్కొన్నారు. భారాస కుట్రలను తిప్పికొట్టి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించినట్లు చెప్పారు. ఖరీఫ్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి తమ ప్రభుత్వ ఘనత అని చెప్పారు.”మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని.. అప్పుతో మాకు అప్పగించింది వాస్తవం కాదా? ఉ ద్యమ సమయంలో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక మీ కుటుంబ సభ్యులకే ఉపాధి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు మీకు ఏటీఎంలా మారిందన్నది అక్షర సత్యం. 25 లక్షల రైతులకు రుణమాఫీ చేయడం గర్వంగా భావిస్తున్నాం. మూసీ పునరుజ్జీవంలో అవినీతి ఉందని కేటీఆర్ గగ్గోలు పెడుతున్నారు. మూసీ పునరుజ్జీవం డీపీఆర్ కోసం రూ.150 కోట్లే ఖర్చు చేశాం. మూసీ కోసం అదనంగా వ్యయం చేయలేదని మీరు గుర్తించాలి. రాష్ట్రానికి పదేళ్ల అధికారిక గీతం లేకుండా చేశారు. మా పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నది మీరు తెలుసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకుల చెవాకులు మానుకోవాలి. ముఖ్యంగా కేటీఆర్ హరీశ్ రావు , కవితను కేసీఆర్ అదుపులో పెట్టాలి.భారాస పదేళ్ల పాలనలో తెలంగాణ వెనుకబాటుకు గురైంది. తెలంగాణ భావోద్వేగంతో 2 సార్లు భారాస అధికారంలోకి వచ్చింది. పదేళ్ల గడీల పాలనలో ప్రజలకు కన్నీరు మిగిల్చారు. భారాస హయాంలో అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఓడిపోయినా మీ పార్టీ నేతల్లో మార్పు రాలేదు. కాంగ్రెస్కు అధికారం ఇవ్వడం ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారు. తగిన సమయంలో ప్రజలు మీకు బుద్ధి చెప్తారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ మాట తప్పారు. నీళ్లు నిధులు, నియామకాల నినాదంతో రాష్ట్రం సాధించుకున్నాం. కేసీఆర్ పీఠం ఎక్కి మాయ-ామాటలతో పాలన సాగించారు. అధికారం చేపట్టగానే కుటుంబ పాలన సాగించారు. రాష్ట్రాన్ని మీ కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించారు. మీరు చేసిన అరాచకాన్ని ప్రజలు ఎప్పటికీ మరవరు” అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

# ప్రజా ఆస్తులను తాకట్టు పెట్టే అధికారం ఎవరిచ్చారు?

## : అశోక్ గజపతిరాజు

మాన్సాస్ భూముల సమస్య పరిష్కారానికి యత్నిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



విశాఖపట్నం, డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): మాన్సాస్ భూముల సమస్య పరిష్కారానికి యత్నిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. విశాఖలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.. సింహాచలం, ఇతర అనుబంధ ఆలయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ.. రుషికొండ భవన నిర్మాణాలు పిచ్చి పని అన్నారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని చెప్పారు. రుషికొండ భవనాల వినియోగంపై ప్రజాభిప్రా-యం తీసుకోవాలని కోరారు. అమరావతిలో చంద్రబాబు సచివాలయం నిర్మించారని గుర్తు చేశారు. జగన్ వచ్చాక దాన్ని తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ప్రజా ఆస్తులను తాకట్టు పెట్టే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. జగన్ హయాంలో అంతా సైకో పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కుడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో అపశ్రుతి

కుడా ఛైర్మన్ తుమ్మల బాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆపశ్రుతి చోటు చేసుకుంది.



కాకినాడ,డిసెంబర్ 15, (రిపబ్లిక్ న్యూస్): కుడా ఛైర్మన్ తుమ్మల బాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. పరిమితికి మించి స్టేజ్పైకి జనం చేరడంతో ఒక్కసారిగా అది కుప్పకూలింది. దీంతో స్టేజ్పై ఉన్న తెదేపా నేతలు చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, జనసేన నేతలు పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఒక్కసారిగా కింద పడిపోయారు. వేదిక ఎత్తు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన తర్వాత యథావిధిగా ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
2

# 2024 కాదు ..2023 లోనే నా పెళ్లి అయిందది :నటి తాప్సీ

తన పెళ్లి గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు నటి తాప్సీ పన్ను అందరూ అనుకుంటున్నట్లు తన పెళ్లి ఈ ఏడాది జరగలేదన్నారు.



తన పెళ్లి గురించి తాజాగా ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు నటి తాప్సీ పన్ను అందరూ అనుకుంటున్నట్లు తన వివాహం ఈ ఏడాదిలో జరగలేదని.. గతేడాదే అయిందని అన్నారు. తాజాగా ఓ ఆంగ్ల వెబ్సైట్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ విషయాన్ని తెలియజేశారు."మా పెళ్లి గతేడాది డిసెంబర్లో లోనే జరిగింది. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నాం. త్వరలోనే మా వివాహ వార్షికోత్సవం రానుంది. నేడు ఈ విషయాన్ని నేను బయట పెట్టకపోతే ఎవరికీ దీని గురించి తెలిసేది కాదు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలకు సంబంధించి సరైన బ్యాలెన్స్ ఉండాలని మేము అనుకున్నాం. మన జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు బయట పెడితే వృత్తిపరమైన విషయాలకు అది ఆటంకంగా మారుతుంది. అదేవిధంగా వర్క్ లైఫ్ సక్సెస్ లేదా ఫెయిల్యూరే అధికంగా పర్సనల్ లైఫ్పై ప్రభావం చూపిస్తే లేనిపోని ఒత్తిడి ఎక్కువ అవుతుంది. అది మాకు ఏమాత్రం ఇష్టం లేదు. అందుకే వ్యక్తిగత విషయాలను మేము పెద్దగా బయటకు చెప్పం. డిసెంబర్లో పెళ్లి తర్వాత ఆత్మీయులు, సన్నిహితుల కోసం ఉదయ్పూర్లో సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నాం. ఆత్మీయులను మాత్రమే పెళ్లికి ఆహ్వానించాం. అంతేకానీ దాని గురించి బహిరంగ ప్రకటన చేయలేదు. అందువల్లనే మా పెళ్లిని అందరూ సీక్రెట్ మ్యారేజ్ అనుకున్నారు" అని తాప్సీ తెలిపారు.డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు. దాదాపు పదేళ్ల నుంచి అతడితో రిలేషన్లో ఉన్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దక్షిణాది నుంచి బాలీవుడ్లోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో అతడితో పరిచయం ఏర్పడిందని, నాటి నుంచి ఆ బంధం కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఈ జంట వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది. ఈ ఏడాది మార్చి 23న ఉదయ్పూర్ పెళ్లి జరిగింది. దీనికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. తన పెళ్లికి సంబంధించిన ఫొటోలను ఆమె అధికారికంగా సోషల్మీడియాలో షేర్ చేయలేదు.

# అల్లు అర్జున్ - స్నేహారెడ్డి
## ఎమోషనల్ వీడియో.. సమంత రియాక్షన్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై అరెస్టై.. బెయిల్పై విడుదలైన నటుడు అల్లు అర్జున్కు సినీ పరిశ్రమ నుంచి మద్దతు లభిస్తోంది. దీనిపై తాజాగా నటి సమంత స్పందించారు.




సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో నటుడు అల్లు అర్జున్ కు సినీ పరిశ్రమ నుంచి మద్దతు లభిస్తున్న విషయం తెలిసిందే. జైలు నుంచి విడుదలైన ఆయన్ని చిత్ర పరిశ్రమకు చెందిన దర్శక-నిర్మాతలు, హీరోలు కలిసి పరామర్శించారు. షూటింగ్స్, ఇతర పనుల్లో బిజీగా ఉన్న పలువురు నటీనటులు సోషల్మీడియా వేదికగా మద్దతు తెలిపారు.తాజాగా నటి సమంత అల్లు అర్జున్ గురించి ఇన్స్టా స్టోరీస్లో పోస్ట్ పెట్టారు. బెయిల్పై విడుదలై ఇంటికి వచ్చిన బన్నీని చూసి ఆయన సతీమణి స్నేహారెడ్డి కన్నీటి పర్యంతమైన విషయం తెలిసిందే. ఈ వీడియోను షేర్ చేసిన సమంత.. "(తాను ఎమోషనల్ అయ్యానని పరోక్షంగా తెలియజేస్తూ..) ఇప్పుడు నేనేమీ ఏడవడం లేదు ఓకే" అని కన్నీళ్లు పెట్టుకుంటున్న ఎమోజీలు షేర్ చేశారు. అల్లు అర్జున్, స్నేహారెడ్డిలను ట్యాగ్ చేసి వారిద్దరిని చూస్తుంటే సంతోషంగా ఉందనే అర్థం వచ్చేలా ఎమోజీలు పంచుకున్నారు. ఈ విషయంపై నయనతార భర్త విఘ్నేశ్ శివన్ కూడా స్పందించారు. అల్లు అర్జున్ ఫ్యామిలీ రీయూనియన్ వీడియో షేర్ చేస్తూ.. "ఇది చూడటం కోసమే ఎదురుచూస్తున్నా. అల్లు అర్జున్కు ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం నిజంగా దురదృష్టకరం. ఆయన వ్యవహరించిన తీరు చాలా హుందాగా ఉంది" అని పేర్కొన్నారు.నటి ఖుష్బూ ఈ విషయంపై స్పందించారు. అల్లు అర్జున్కు సపోర్ట్ చేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "తమ సొంత వైఫల్యాలను దాచి పెట్టుకోవడం కోసం ఈగోలు, అభద్రతాభావాలు, పవర్ గేమ్ లు ఆడతారు. అలాంటి అవసరం అల్లు అర్జున్ కు లేదు. బన్నీ నీకు మరింత శక్తి ఇవ్వాలని కోరుకుంటున్నా. ఏదీ నిన్ను ఆపలేదు" అని అన్నారు.హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్లోని సంధ్య థియేటర్లో ప్రదర్శించిన 'పుష్ప 2' బెనిఫిట్ షో (డిసెంబర్ 4)కు అల్లు అర్జున్ హాజరైన విషయం తెలిసిందే. ఆయన్ని చూసేందుకు అభిమానులు పోటీపడ్డారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకొని రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె తనయుడు శ్రీతేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్న పోలీసులు థియేటర్కు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ11గా అల్లు అర్జున్ను పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన్ని అరెస్ట్ చేసి చంచల్గూడ జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో శనివారం ఉదయం ఆయన విడుదలయ్యారు. బాధిత కుటుంబానికి తాను అన్నివిధాలుగా సాయం చేస్తానని అల్లు అర్జున్ నిన్న జరిగిన ప్రెస్మీట్లో చెప్పారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని.. ఈ ఘటనతో తనకు ఎలాంటి ప్రమేయం లేదని చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# వారికి నా కృతజ్ఞతలు .: ఉపాసన లేటెస్ట్ పోస్ట్

నటుడు రామ్ చరణ్ ఉపాసన పెట్టిన సరికొత్త పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. దీనిలో ఓ ఆసక్తికర విషయాన్ని ఆమె తెలియజేశారు.



తన జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తరచూ సోషల్మీడియా వేదికగా షేర్ చేస్తుంటారు నటుడు రామ్చరణ్ సతీమణి ఉపాసన తాజాగా ఆమె సనాతన ధర్మాన్ని ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా పోస్ట్ పెట్టారు. గౌరవ, మర్యాదలతో ఇతరులకు వైద్యం అందించడమే నిజమైన సనాతన ధర్మమని తన తాతయ్య చెప్పినట్లు ఆమె తెలిపారు."అవసరమైన వారికి సానుభూతి, గౌరవంతో వైద్యాన్ని అందించడమే మాకు నిజమైన సనాతన ధర్మం అని తాతయ్య నేర్పించారు. ఆయన మాటల నుంచి స్ఫూర్తి పొందిన మేము.. అయోధ్య రామ మందిరం వద్ద అపోలో ఉచిత ఎమర్జెన్సీ కేర్ సెంటర్ ప్రారంభించాం. తిరుమల, శ్రీశైలం, కేదార్నాథ్, బద్రీనాథ్లో విజయవంతంగా ఈ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇప్పుడు రామ జన్మభూమిలో దీనిని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ విషయంలో మాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. శనివారం ఈ సెంటర్లను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1925: కవి, విమర్శకుడు, నాటక రచయిత ఎస్.వి.భుజంగరాయశర్మ జననం.(మ.1997)
- 1933: చిత్రకారుడు బాపు జననం. (మ.2014).
- 1938: కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య జననం. (మ.2018)
- 1939: కవి, విమర్శకుడు నూతలపాటి గంగాధరం జననం. (మ.1975)
- 1950: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ కేంద్ర మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ మరణం.(చిత్రంలో)
- 2014: తెలుగు సినిమా సంగీత దర్శకుడు చక్రి మరణం. (జ.1974).




చిత్రకారుడు బాపు



పెద్దిభొట్ల సుబ్బరామయ్య



గంగాధరం



సర్దార్ వల్లభాయి పటేల్



చక్రి

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# బుమ్రాకి ఐదు వికెట్లు.. హెడ్ - స్మిత్ సెంచరీలు.. ఆసీస్ స్కోరు 405/7

2024..! బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఏకంగా 377 పరుగులు చేసింది.



గబ్బా టెస్టులో టాస్ నెగ్గిన భారత్ కు పెద్దగా కలిసిరాలేదు. తొలి ఇన్నింగ్స్ లో ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించి పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తోంది. ట్రావిస్ హెడ్ (152), స్టీవ్ స్మిత్ (101) సెంచరీలు బాదేశారు. రెండో రోజు ఆట ముగిసేసమయానికి ఆస్ట్రేలియా ఏడు వికెట్ల నష్టానికి 101 ఓవర్లలో 405 పరుగులు చేసింది. క్రీజ్లో అలెక్స్ కేరీ (45బి), మిచెల్ స్టార్క్ (7బి) ఉన్నారు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అతడి టెస్టు కెరీర్ లో 12వ సారి ఈ ఘనత సాధించాడు.బుమ్రా ముందుండి..తొలి రోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. వర్షం కారణంగా మ్యాచ్ జరగలేదు. దీంతో రెండో రోజు ఆట అరగంట ముందుగానే ప్రారంభమైంది. వర్షంతో పిచ్ ఉదయం బౌలింగ్కు సహకరించింది. దీనిని ఉపయోగించుకున్న బుమ్రా స్వల్ప వ్యవధిలో వికెట్లు తీశాడు. ఓవర్నైట్ 28/0 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్కు బుమ్రా చుక్కలు చూపించాడు. ఓపెనర్లు నాథన్ మెక్స్వీనీ (9), ఉస్మాన్ ఖవాజా (21)ను బుమ్రా ఔట్ చేశాడు. అనంతరం మార్నస్ లబుషేన్ (12) భారత బౌలింగ్ ఓర్పును పరీక్షించాడు. స్టీవ్ స్మిత్తో కలిసి మూడో వికెట్కు 37 పరుగులు జోడించాడు. నితీశ్ కుమార్ అద్భుతమైన బంతితోపాటు విరాట్ సూపర్ క్యాచ్తో లబు షేన్ పెవిలియను చేరాడు. పాతుకుపోయిన జోడీ.. విడదీసిన బుమ్రా లబుషేన్ ఔట్ తర్వాత క్రీజ్లోకి వచ్చిన ట్రావిస్ హెడ్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. మరోవైపు స్మిత్ నిలకడగా పరుగులు రాబట్టాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్కు ఏకంగా 241 పరుగులను జోడించడం గమనార్హం. ఈ క్రమంలో సెంచరీలు పూర్తి చేసుకున్నారు. హెడ్కిది 9వ శతకం కాగా.. భారత్పై మూడోది కావడం గమనార్హం. ఇక స్మిత్ దాదాపు 25 ఇన్నింగ్స్ తర్వాత సెంచరీ చేశాడు. అయితే, మరింత ప్రమాదకరంగా మారిన వీరిద్దరిని బుమ్రా విడదీశాడు. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు తీసి బుమ్రా భారత్ కు బ్రేక్ ఇచ్చాడు. మిచెల్ మార్ష్ (5) పెద్దగా పరుగులు చేయకపోయినా.. కెప్టెన్ పాట్ కమిన్స్ (20) కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అలెక్స్ కేరీతో కలిసి 58 పరుగులు జోడించాడు. ఇవాళ మ్యాచ్ను ఉదయం అరగంటతోపాటు చివర్లోనూ పొడిగించారు. దీంతో 88 ఓవర్ల ఆట జరిగింది. ఒక్క రోజులో మొత్తం 377 పరుగులను ఆసీస్ రాబట్టింది.


## ఇంటి చిట్కాలు




# మొక్కల కోసం టానిక్.. మజ్జిగలో వీటిని కలిపి వాడితే పురుగులు, చీడపీడలు వదిలిపోవాల్సిందే..

ఈ రోజుల్లో చాలా మంది గార్డెనింగ్ ఇష్టపడుతున్నారు. చిన్న స్థలం ఉన్నా సరే అక్కడ మొక్కల్ని పెంచుతున్నారు. నగరాల్లో నివసించే ప్రజలు కుండీల్లో మొక్కల్ని నాటుతున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజలు తమ పెరట్లో కూరగాయలు, పూల మొక్కలతో పాటు కొన్ని ఔషధపు మొక్కల్ని పెంచతున్నారు. ఇక, సాధారణంగా గార్డెన్లో పూలు, పండ్లతో పాటు ఇతర గార్డెనింగ్ మొక్కల్ని పెంచుతుంటాం. మన పెరడు లేదా బాల్కనీలో కొన్ని రకాల మొక్కలను పెంచడం ద్వారా శారీరక, మానసిక, ఆరోగ్యపరమైన లాభాల్ని పొందవచ్చు.అయితే, మొక్కలు పెంచాలి అన్న ఆలోచన ఉండే సరిపోదు.. వాటిని పెంచడం కూడా తెలిసి ఉండాలి. ఇక, చాలా మంది ఇంట్లో మొక్కలు బాగా పెంచినా కీటకాలు, పీడతో ఇబ్బంది పడతాయి. అయితే, వీటిని తరిమికొట్టడానికి రకరకాల రసాయనాలు వాడతారు. ఈ రసాయనాలతో నేల సారం దిబ్బతినడమే కాకుండా.. మొక్కలు కూడా నాశనమయ్యే ప్రమాదముంది. ర-సాయనాలకు బదులు ఇంట్లో దొరికే వాటితో మొక్కల కోసం టానిక్ తయారు చేయవచ్చు. ఈ టానిక్తో కీటకాలు పారిపోవడమే కాకుండా మొక్కలు ఏపుగా పెరుగుతాయి. ఇది ఎలా చేసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.

### మొక్కల టానిక్ కోసం కావాల్సిన పదార్థాలు..



మజ్జిగ - ఒక బాటిల్
నీరు - 10 లీటర్లు..
వేప నూనె- రెండు గిన్నెలు

### ఇలా తయారుచేయండి..



ముందుగా ఒక బాటిల్ నిండా మజ్జిగ తీసుకోని.. దాన్ని నీడలో 10 నుంచి 15 రోజులు ఉంచాలి. అప్పుడప్పుడూ రోజుకు ఒక్కసారైనా బాటిల్ని షేక్ చేస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. అప్పుడు ఈ సీనాలో మజ్జిగను ఒక పెద్ద బకెట్లో తీసుకోండి. ఈ మజ్జిగకు 10 లీటర్ల నీటితో పాటు రెండు పెద్ద గిన్నెల వేప నూనె యాడ్ చేయండి. ఈ మిశ్రమాన్ని బాగా కలపండి. ఇంకేముంది.. కీటకాలను తరిమికొట్టే ద్రావణం సిద్ధం అవుతుంది.



### వాడే పద్ధతి..




బకెట్లో తయారు చేసిన ద్రావణాన్ని స్ప్రే బాటిల్లో తీసుకోండి. ఇప్పుడు ప్రతి వారం మొక్కలను పురుగుల నుంచి రక్షించడానికి పిచికారీ చేయండి. మీ మొక్కలలో కీటకాలు ఎక్కువగా ఉంటే.. వారానికి రెండు నుంచి మూడు రోజులు ఈ ద్రావణాన్ని పిచికారీ చేయవచ్చు. లేదంటే వారానికి ఒకసారి స్ప్రే చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మొక్కల నుంచి కీటకాల్ని తరిమికొడుతుంది.

### వీటితో మొక్కలు ఏపుగా పెరుగుతాయి..



అరటి పండు తొక్క..మనలో చాలా మంది అరటి పండు తిన్నాక.. తొక్కే కదా అని పారేస్తుంటాం. అయితే, అరటి తొక్కతో చాలా ప్రయోజనాలు ఉంటాయి. మొక్కలు ఏపుగా పెరగడానికి అరటి తొక్కలు వాడుకోవచ్చు. ఇందుకోసం.. అరటి తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దాని మీద కొద్ది మట్టి కప్పండి. అరటి పండు మట్టిలో కలిసిపోయి.. మంచి ఎరువుగా పనిచేస్తుంది. పూల మొక్కలకు కూడా ఇది బాగా పనిచేస్తుందట. పూలు బాగా పెద్దవిగా పెరుగుతాయంట.

### పాలు..



మొక్కలు బాగా పెరగాలంటే పాలను ఎరువుగా వాడుకోవచ్చు. పాలలో ఉండే కాల్షియం, ప్రోటీన్ మొక్కలకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇవి మొక్కను ఏపుగా పెంచుతాయి. పాలను ఎర-ువుగా వాడాలంటే.. ఒక చెంచా పాలను ఒక లీటరు నీటిలో కలపండి. ఇప్పుడు ద్రావణాన్ని మొక్కలకు పోయండి. ప్రతి నెలా ఈ ద్రావణాన్ని పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలుంటాయని నిపుణులు చెబుతున్నారు.

### ఉల్లిపొట్టు..



ఉల్లి పొట్టు కూడా మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. మొక్కలకు చీడ పట్టకుండా నివారించడంలో ఉల్లిపొట్టు కీలక పాత్ర పోషిస్తుంది. ఉల్లి పొట్టును అలా మొక్కల పొదల్లో వేసినా సరిపోతుంది. లేదంటే.. ఐదు లీటర్ల గోరు వెచ్చని వాటర్లో ఓ ఇరవై నుంచి ముప్పై గ్రాముల ఉల్లిపొట్టుని వేసి నాలుగు రోజుల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ వేస్తే.. అవి బాగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.